www.navatelangana.com
నవతెలంగాణ
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
ఆదివారం 16 ఏప్రిల్ 2023

17 నుండి విద్యుత్ ఉద్యోగుల సమ్మె

కౌటాల : సమస్యలు పరిష్కరించాలని 17 నుండి సమ్మె చేయనున్నట్టు తెలంగాణ పవర్ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా కోకన్వీనర్ ఎమ్మాజీ, సతీష్ అన్నారు. శనివారం కౌటాల విద్యుత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమ్మె అవగాహన సదస్సులో మాట్లాడారు. 2022, ఏప్రిల్ ఒకటి నుండి రావాల్సిన వేతన సవరణ వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆర్టిజన్ కార్మికులకు 50 శాతం ఫిట్‌మెంట్‌తో పాటు కన్వర్షన్ అవకాశం ఇవ్వాలని, ఆన్‌మాండ్ కార్మికులను ఆర్టీజన్‌లుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 16వ తేదీలోపు కార్మికుల సమస్యలు పరిష్కరించని ఎడల 17 నుండి సమ్మెలోకి వెళ్లనున్నట్టు పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు రవీందర్, చిప్ప రమేష్, చంద్రశేఖర్, ధర్మయ్య, అశోక్, మాధవ్, రామ్మూర్తి, ప్రశాంత్, సుధాకర్, సంపత్ పాల్గొన్నారు.



సైబర్, మాదకద్రవ్యాలపై అవగాహన

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని దేగామ గ్రామంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శనివారం కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా గ్రామ ప్రజలకు సైబర్ నేరాలు, డయల్ 100, మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలు మద్యం, గంజాయి తదితర వాటి వినియోగం వల్ల కలిగే అనర్థాలు, వృద్ధుల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు తదితర వాటిపై ఏఎస్ఐ బి.సురేందర్ అవగాహన కల్పించారు. చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.



ప్రసవ వేదన..పేదల రోదన..!

- రిమ్స్‌లో గర్భిణీల పట్ల నిర్లక్ష్య ధోరణి
- కొందరు వైద్యులు, సిబ్బంది దురుసు ప్రవర్తన
- గత్యంతరం లేక ప్రయివేటుకు నిరుపేదలు
- రిమ్స్‌లో తరుచూ చోటుచేసుకుంటున్న ఘటనలు

పేదలకు మెరుగైన చికిత్స అందించాలనే లక్ష్యంతో నెలకొల్పిన రిమ్స్ ఆస్పత్రిలో నిర్లక్ష్య ధోరణి కనిపిస్తోంది. కొందరు వైద్యులు, సిబ్బంది వ్యవహరించే తీరుతో అబాసుపాలవుతోంది. ఆదిలాబాద్‌కు వరప్రదాయినిగా ఉన్న రిమ్స్ ఆస్పత్రిలో పేదల పట్ల అలసత్వ వైఖరి ప్రదర్శిస్తున్నారు. చేతిలో చిల్లిగవ్వ లేక ప్రయివేటుకు వెళ్లలేని నిరుపేదలు సర్కారు వైద్యం కోసం వస్తే వారికి భరోసా కరువవుతోంది. ఆదివాసీ, గిరిజనులు, పేదలు అధికంగా ఉన్న జిల్లాలో మెరుగైన వైద్యం అందని ద్రాక్షగానే మారుతోంది. తాజాగా గర్భిణీ ఉదంతమే ఇందుకు నిదర్శనంగా కనిపిస్తోంది. అత్యవసర పరిస్థితిలో వైద్యం కోసం వచ్చిన బాధితులకు స్వాంతన కలిగించాల్సిన వైద్యులు, సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. ఇలాంటి ఘటనలు తరుచుగా జరుగుతున్నా ఉన్నతాధికారులు దృష్టిసారించి దిద్దుబాటు చర్యలు చేపట్టడం లేదు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రభుత్వ సాధారణ ప్రసవాలకు పెద్దపీఠ వేయాలని చెబుతోంది. సర్కారు ఆస్పత్రుల్లో ప్రసవం అయితే కేసీఆర్ కిట్‌తో పాటు రూ.13వేల ఆర్థిక సాయం అందిస్తామని ఘనంగా చెబుతోంది. ఇందుకు ప్రజలను ప్రోత్సహించాలని ఆదేశాలు జారీ చేసింది. కానీ క్షేత్రస్థాయిలో సర్కారు ఆస్పత్రుల్లో కనిపిస్తున్న నిర్లక్ష్య ధోరణలు పేద రోగులకు ప్రాణ సంకటంగా మారుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లాకు వరంలా ఉన్న రిమ్స్ ఆస్పత్రిలో కొందరు వైద్యులు, సిబ్బంది తీరు వివాదస్పదంగా మారుతోంది. వివిధ వ్యాధులు, రోగాలతో ఆస్పత్రికి వచ్చే జనాల్లో భరోసా నింపాల్సిన వైద్యులు ఆ దిశగా వ్యవహరించడం లేదు. ఆదిలాబాద్ జిల్లాతో పాటు ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రసవం కోసం రిమ్స్ ఆస్పత్రిలో ప్రవసం కోసం వస్తుంటారు. రిమ్స్ ఆస్పత్రిలోని గైనకాలజీ విభాగంలో రోజూ పదుల సంఖ్య ప్రసవాలు జరుగుతుంటాయి. కానీ అక్కడి విభాగంలోకి కొందరు వైద్యులు వ్యవహరిస్తున్న తీరుతో బాధితులు ఆందోళనకు గురవుతున్నారు. ఇటీవల సుందరగిరికి చెందిన గర్భిణీ ప్రసవం కోసం ఆస్పత్రికి వచ్చి నొప్పులతో బాధపడుతున్నా వైద్యులు, సిబ్బంది స్పందించలేదనే బాధిత కుటుంబం చెబుతోంది. మరోపక్క వారితో దురుసుగా మాట్లాడటంతో గత్యంతరం లేక ప్రయివేటు ఆస్పత్రికి వెళ్లారు. చేతిలో చిల్లిగవ్వ లేని ఆ నిరుపేదలు చెవి కమ్మలు విక్రయించి ప్రసవం చేయించాల్సిన దుస్థితి వచ్చింది. రిమ్స్‌లో వైద్యులు సదరు కుటుంబానికి కొంచెం భరోసా ఇస్తే అక్కడే ప్రసవమయ్యే అవకాశం ఉండేది.

తరుచూ ఘటనలు.. అధికారుల మౌనం..!

రిమ్స్ ఆస్పత్రిలో తరుచూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నా ఉన్నతాధికారులు దృష్టిసారించడం లేదు. గతంలో ఆదిలాబాద్ పట్టణం బొక్కలగూడకు చెందిన ఓ గర్భిణి ప్రసవం కోసం ఆస్పత్రికి రాగా సకాలంలో వైద్యులు పట్టించుకోకపోవడంతో గర్భిణీతో పాటు శిశువు కూడా మృతిచెందారు. ఇంతకుముందు కూడా ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్న సందర్భాలున్నాయి. రిమ్స్ ఆస్పత్రి అబాసుపాలు కావడానికి కొందరు వైద్యులు వ్యహరిస్తున్న తీరే కారణమనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. నిర్లక్ష్య ధోరణి కనబరుస్తున్నారని సంబంధిత వైద్యులపై తరుచూ ఆరోపణలు వస్తున్నా ఉన్నతాధికారులు మౌనం దాల్చడం విమర్శలకు కారణమవుతోంది. ఇలాంటి పరిస్థితుల కారణంగా నిరుపేదలు సైతం సర్కారు దవఖానాలకు ప్రసవం కోసం రావాలంటే భయపడాల్సిన దుస్థితి వస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెంచాలని చెబుతున్న ప్రభుత్వం ఇలాంటి ఘటనలపై మాత్రం దృష్టిసారించడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

జైనథ్
మండలం సుందరిగిరి గ్రామానికి చెందిన సిడాం శిరీష అనే గర్భిణీ ఈ నెల 13వ తేదీన ప్రసవం కోసం రిమ్స్‌కు వచ్చింది. పురిటి నొప్పులు రావడంతో కుటుంబీకులు వైద్యులను సంప్రదించి ప్రసవం చేయాలని వేడుకున్నారు. నొప్పులు అలాగే వస్తాయని దురుసుగా మాట్లాడటంతో బాధిత కుటుంబీకులు భయపడ్డారు. గత్యంతరం లేక ప్రయివేటుకు తీసుకెళ్లి ప్రసవం చేయించారు. చేతిలో చిల్లిగవ్వలేని ఆ నిరుపేద కుటుంబం చెవి కమ్మలు విక్రయించి వైద్యం కోసం వెచ్చించాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు రిమ్స్‌లో తరుచూ జరుగుతున్నా ఉన్నతాధికారులు దిద్దుబాటు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.



క్రిమినల్ కేసులు నమోదు చేయాలి : పూసం సచిన్, టీఏజీఎస్ జిల్లా కార్యదర్శి

ఆదివాసీ మహిళ పురిటి నొప్పులతో ఆస్పత్రికి వస్తే ప్రసవం చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించి వెళ్లగొట్టిన వైద్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. పేదలు సర్కారు ఆస్పత్రికి వస్తే కనీసం పట్టింపు లేకుండా వ్యవహరించడం వైద్యుల పనితీరుకు అద్దం పడుతోంది. ప్రయివేటులో వైద్యం కోసం బంగారం అమ్ముకోవాల్సి రావడం బాధాకరం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు దృష్టిసారించాలి.



ఈ ఘటనపై విచారణ జరిపిస్తున్నాం : జైసింగ్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్

రిమ్స్‌లో ఇటీవల జరిగిన ఘటన విషయం నా దృష్టికి వచ్చింది. ఏమి జరిగిందనే విషయమై ముగ్గురు అధికారులతో కూడిన బృందాన్ని విచారణ కోసం నియమించాం. ఆ నివేదిక రాగానే తదుపరి చర్యలు తీసుకుంటాం. ఆస్పత్రిలో పేదలకు నాణ్యమైన సేవలందించేందుకు నిరంతరం కృషిచేస్తున్నాం.



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

ఆర్జీయూకేటీ విద్యార్థులకు ఉచిత శిక్షణ



నవతెలంగాణ-బాసర

ఆర్జీయూకేటీ విద్యార్థులకు మై పర్ఫెక్టీస్ సంస్థ ద్వారా ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు వైస్ ఛాన్సలర్ వెంకటరమణ తెలిపారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ఉద్యోగ అవకాశాలు పొందడంపై మై పర్ఫెక్టీస్ సంస్థ అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత నైపుణ్యాభివృద్ధిపై ఆన్‌లైన్ ప్లాట్ ఫామ్ ద్వారా ఆర్జీయూకేటీ విద్యార్థులకు శిక్షణ ఇచ్చి ఉపాధి ఉద్యోగ అవకాశాలు పెంపొందించడానికి ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని వీసీ అన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమం పోస్టర్లను హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజేష్, ప్రభుత్వ విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ , వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వెంకటరమణ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎల్ రమాదేవి, డైరెక్టర్ ఎమర్జింగ్ టెక్నాలజీ రుషిక, మై పర్ఫెక్టీస్ సంస్థ ప్రాజెక్టు హెడ్ డైరెక్టర్ సుధాన్షు శేఖర్, డీన్ చంద్రశేఖర్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా పోస్ట్‌పై పోలీసులకు ఫిర్యాదు

నవతెలంగాణ-లక్షెట్టిపేట్

భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను సోషల్ మీడియా వేదికగా కించపరుస్తూ దూషించిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం రాత్రి పోలీసులకు అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సంఘం పట్టణాధ్యక్షుడు బోనగిరి కుమార్ మాట్లాడుతూ విశ్వ విజ్ఞాని, అందరి సమానత్వం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు అంబేద్కర్‌ను ఇద్దరు వ్యక్తులు ఫేస్‌బుక్‌లో కించపరిస్తూ వ్యాఖ్యలు చేయడం సిగ్గు చేటన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని విమర్శిస్తూ, మత కలహాలు రెచ్చగొట్టేలా ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసిన వ్యక్తుల పూర్తి వివరాలు, సంబంధిత ఆధారాలను పోలీసులకు అందజేశామన్నారు. అంబేద్కర్ సిద్ధాంతాలను, ఆశయాలను అర్థం చేసుకోకుండా కొందరు వ్యక్తులు దుష్ప్రచారం చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం పట్టణ ప్రధాన కార్యదర్శి పెండెం సతీష్, నాయకులు కండె మొగిలి, కోడి కుమార్, అభిలాష్, ఎం.కుమార్, అడ్లూరి అక్షయ్, తొగరి రాజన్న, నంది తిరుపతి, ఎం.సందీప్‌కుమార్, కె. కుమార్, అవునూరి వెంకటేష్, డి.సందీప్ కుమార్, మహేందర్, శ్రవణ్, పోశం పాల్గొన్నారు.

సమస్యను పరిష్కరించి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

నవతెలంగాణ-ముధోల్

మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శుక్రవారం రాత్రి సాంకేతిక సమస్య తలెత్తడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. సబ్‌స్టేషన్‌లోని పిటిఆర్లో సమస్య తలెత్తడంతో దాదాపు నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. నిర్మల్ నుండి ఎంఆర్టి సభ్యులు యుద్ధ ప్రాతిపదికన సబ్ స్టేషన్‌కు చేరుకొని సమస్యను గుర్తించడానికి తీవ్రంగా ప్రయత్నించారు. అర్ధరాత్రి వరకు ప్రయత్నించిన విద్యుత్ సరఫరాను పునరుద్ధరించలేకపోయారు. దీంతో ముధోల్‌కు తరోడా సబ్‌స్టేషన్ నుండి విట్టోలి, బ్రహ్మన్‌గావ్ సబ్‌స్టేషన్ నుండి విద్యుత్ సరఫరా చేశారు. శనివారం ఉదయం నుండి సబ్‌స్టేషన్ సాంకేతిక బృందం సభ్యులు సమస్య గుర్తించి పరిష్కరించారు. దీంతో యధావిధిగా విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. రాత్రి సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో పాటు ఈదురుగాలులు వర్షానికి ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనులను భైంసా డిఈ శ్రీనివాస్‌రెడ్డి, ఏడిఏ లక్ష్మణ్, ఎంఆర్టి డిఈ రమేష్, ఏఈ మల్లేష్, ముధోల్ ఏఐ శ్రీకాంత్ పర్యవేక్షించారు. అధికారుల వెంట సబ్ ఇంజనీర్ పాషా, లైన్ ఇన్‌స్పెక్టర్ సాయినాథ్, లైన్‌మెన్, సిబ్బంది ఉన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



నవతెలంగాణ-నార్నూర్ : ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ టి.దుర్గారాణి అన్నారు. శనివారం ఉమ్మడి మండలంలోని ఉమ్రి, లోకారి గ్రామాల్లో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచిత న్యాయ సహాయం, మోటార్ వెహికల్ యాక్ట్, ప్రీ లీగల్ ఎయిడ్, మెయింటనెన్స్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం లోకారి మినీ గురుకులాన్ని తనిఖీ చేశారు. తరగతి గదులు, వంట గదులు, తాగునీటి వసతులను పరిశీలించారు. కార్యక్రమంలో సిఐ ప్రేమ్‌కుమార్, ఎస్ఐ రవికిరణ్, గాదిగూడ ఎస్ఐ ఇమ్రాన్, సర్పంచ్ రాథోడ్ రవీందర్, మెస్రం దేవ్‌రావ్ పాల్గొన్నారు.

ఎంసెట్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎంసెట్ శిక్షణ తరగతులను సద్వినియోగ పరచుకొని విద్యార్థులు ఉన్నత విద్యాసంస్థలలో ప్రవేశాలు పొందాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పి.ఎస్ అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ కొలాం బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఎంసెట్ శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంసెట్ శిక్షణ తరగతులను సద్వినియోగ పరచుకొని ఇంజినీరింగ్, మెడికల్ కళాశాలల్లో ప్రవేశాలు పొందాలని, ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియేట్ రెండవ సంవత్సరం పరీక్షా రాసిన 100 మంది విద్యార్థులను ఎంపిక చేసి ఉచిత ఎంసెట్ శిక్షణతో పాటు వసతి సౌకర్యం కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 12 నుండి మే 8 వరకు ఈ శిక్షణ తరగతులను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి నిమిషం విలువైనదని, సమయం సమయాన్ని సద్వినియోగపరచుకొని చదవాలన్నారు. ఎంసెట్ మాదిరి ప్రశ్నపత్రాలను ప్రాక్టీస్ చేయాలని, కెమిస్ట్రీ, మ్యాథ్స్ సబ్జెక్టులపై ఎక్కువగా పట్టు సాధించాలని, సందేహాలను నివత్తి చేసుకోవాలని పేర్కొన్నారు. ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలని, కష్టపడి చదవి ఎంసెట్‌లో మంచి ర్యాంక్ సాధించి, అనుకున్న లక్ష్యాన్ని సాధించాలన్నారు. ఈ సందర్భంగా ఎంసెట్ పరీక్షా రాసే విధానంపై సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో శిక్షణ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, డీఐఈఓ పర్యవేక్షకులు మోసిన్, ఫాకల్టీలు సృజన్, మహేష్ కుమార్, ప్రియాంక, రవీందర్ పాల్గొన్నారు.

రెండో విడత గొర్రెల పంపిణీ పకడ్బందీగా చేపట్టాలి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి అమలు చేస్తున్న 2వ విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో 2వ విడత గొర్రెల పంపిణీ కార్యక్రమంపై గొల్ల, కుర్మల సహకార సొసైటీల సభ్యులకు నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను గొల్ల, కుర్మలు సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. జిల్లాలో మొదటి విడతలో 5022 గొర్రెలను పంపిణీ చేయడం జరిగిందని పేర్కొన్నారు. రెండవ విడతలో 3638 గొర్రెల పంపిణీకి ప్రణాళికలు సిద్ధం చేయాలని పశు సంవర్ధక శాఖ అధికారిని ఆదేశించారు. ఇప్పటి వరకు డిడిలు చెల్లించిన లబ్దిదారులు ఎవరైన మరణించినట్లైతే వారి నామినీలకు యూనిట్లను అందజేయడం జరుగుతుందన్నారు. రెండవ విడత గొర్రెల కొనుగోలుకు మహారాష్ట్ర లోని వివిధ ప్రాంతాలలో కొనుగోలు చేయడం జరుగుతుందని, రాష్ట్ర స్థాయి అధికారులు ఈ కొనుగోలు ప్రక్రియను పరిశీలిస్తారని అన్నారు. ఈ సమావేశంలో పశుసంవర్ధక శాఖ అధికారి కిషన్, ఎడి రామారావు, సొసైటీల సభ్యులు రఘువీర్, హన్మండ్లు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం : బట్టి విక్రమార్క



- సహజ వనరులను ధ్వంసం చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం
- సభను విజయవంతం చేసిన ప్రజలకు రుణపడి ఉంటాం
- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

నవతెలంగాణ- మంచిర్యాల

రాబోయే ఎన్నికల్లో దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నస్పూర్‌లో నిర్వహించిన భారీ బహిరంగ సభను విజయవంతం చేసిన ప్రజలకు రుణపడి ఉంటామని తెలిపారు. లక్షకు పైగా జన సమీకరణ చేపట్టిన ఉమ్మడి జిల్లా పార్టీ నాయకత్వానికి కార్యకర్తల ఐక్యత గర్వకారణంగా ఉందన్నారు. సభకు హాజరైన జాతీయ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గేతో పాటు ముఖ్య నాయకులు ప్రజా స్పందన పట్ల హర్షం వ్యక్తం చేస్తూ జిల్లా నాయకత్వం పనితీరును అభినందించారు. తాను చేపట్టిన పాదయాత్ర నెల రోజులపాటు విజయవంతంగా సాగుతుందని, యాత్ర ద్వారా ప్రత్యక్షంగా ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నట్లు వెల్లడించారు. ఉమ్మడి జిల్లాలో సహజ వనరులను బీఆర్ఎస్ ప్రభుత్వం ధ్వంసం చేస్తోందని ఆరోపించారు. గిరిజనుల పోడు భూముల సమస్యతో పాటు సింగరేణి గని కార్మికుల డిమాండ్లు, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాల సమస్యలను తాము అధికారంలోకి రావడంతోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఖమ్మం జిల్లా వరకు సాగుతుందని వెల్లడించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, పార్టీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, పిసిసి కార్యదర్శి చిట్ల సత్యనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పూదరి తిరుపతి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు తూముల నరేష్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పెంట రజిత, నాయకులు రావుల ఉప్పలయ్య, వేములపల్లి సంజీవ్ జంగపెల్లి బాబన్న, హేమలత, రాజమౌళి పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలి

- కలెక్టర్, అదనపు కలెక్టర్‌కు సమ్మె నోటీసు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జూనియర్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులర్ చేయాలని జూనియర్ పంచాయితీ కార్యదర్శుల సంఘం నాయకులు అన్నారు. లేని పక్షంలో ఈనెల 28 నుండి రాష్ట్రవ్యాప్తంగా సమ్మెకు దిగుతామని 13న పంచాయతీరాజ్ కమిషనర్, డైరెక్టర్‌కు సమ్మె నోటీస్ అందించారు. ఇందులో భాగంగా శనివారం జిల్లా పంచాయతీ కార్యదర్శులు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషాకు సమ్మె నోటీస్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షులు కె.చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి పి.ప్రశాంత్, రంజిత్, అరుణ్, అజర్, చైతన్య, గంగన్న అన్ని మండలాల ప్రతినిధులు పాల్గొన్నారు.

బోథ్ : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పంచాయతీ కార్యదర్శులు శనివారం ఎంపీడీవో కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని 25 పంచాయతీ సెక్రెటరీలు 28 నుండి సమ్మెలో పాల్గొంటారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదన్నారు. అలాగే జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు పర్మినెంట్ చేయాలన్నారు. మరణించిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు కారుణ్య నియామకం చేపట్టాలని, అర్హులైన కార్యదర్శులకు ప్రమోషన్ కల్పించాలని, జీవో 317తో నష్టపోయిన కార్యదర్శులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించేంత వరకు సమ్మెలో ఉంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు దిలీప్, రవీందర్, జితేందర్, షకీల్, వినోద్, రజిత, సుజాత, నిరోషా, కాశీరాం, ప్రసాద్, విజయ్ పాల్గొన్నారు.

బెజ్జూర్ : ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలో ఎంపీఓ రమేష్‌రెడ్డికి సమ్మె నోటీసు అందజేశారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని, ఓపీఎస్ కార్యదర్శులను జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా నియమించాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సమ్మె నోటీసు అందజేశారు. నోటీస్ అందజేసిన వారిలో కార్యదర్శులు తుకారాం, కృష్ణ, వెంకటేష్, ఈశ్వర్, రాములు, వెంకట్రావ్, వైకుంఠం ఉన్నారు.

పెంచికల్‌పేట్ : ఎంపీడీఓ గంగాసింగ్‌కు జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఓపీఎస్‌తో కలిసి శనివారం సమ్మె నోటీసు అందజేశారు. సీటీఎస్ఎఫ్ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు ఈ నెల 28 నుండి సమ్మె చేయనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులర్ చేస్తూ జీవో విడుదల చేయాలని, నాలుగేండ్ల ప్రొబేషన్ కాలాన్ని సర్వీసు కాలంగా గుర్తించాలని, మరణించిన జూనియర్ పంచాయతీ కార్యదర్శుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు చేపట్టాలని, పరస్పర బదిలీలు, స్పౌజ్ బదిలీలకు అవకాశమివ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శ్రీకాంత్, కుషబొద్దీన్, రాకేష్, చంద్రశేఖర్, కిష్టయ్య పాల్గొన్నారు.



బెజ్జూర్

17న సత్యాగ్రహ సభను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఇచ్చోడ

రాహుల్ గాంధీ సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలో సత్యాగ్రహ సభ నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ అధ్యక్షుడు సాజిద్ ఖాన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 17న మండల కేంద్రంలోని షార్ప్ గార్డెన్‌లో రాహుల్ గాంధీ సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని, ఆయనపై కేసు నమోదు చేయడాన్ని, నివాసం ఉంటున్న ఇంటిని ఖాళీ చేయించడాన్ని నిరసిస్తూ సత్యాగ్రహ సభ నిర్వహిస్తామన్నారు. సత్యాగ్రహ సభకు మాజీ మంత్రి షబ్బీర్ అలీ, ములుగు ఎమ్మెల్యే సీతక్క, ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు బెల్లయ్య నాయక్, స్పోక్స్ పర్సన్ అద్దంకి దయాకర్, బాల్కొండ మాజీ ఎమ్మెల్యే ఇరవత్రి అనిల్ రానున్నట్లు తెలిపారు. బోథ్ నియోజకవర్గ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, అన్ని గ్రామాల కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ నాయకులు ఆడే గజేందర్, ఇచ్చోడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమూద్ ఖాన్, అధ్యక్షుడు కళ్లెం నారాయణరెడ్డి, ఎంపీటీసీ జాహెద్, సిరికొండ మండల అధ్యక్షుడు షేకీమామ్, బజార్‌హత్నూర్ మండలం అధ్యక్షుడు సామాన్పల్లి శేఖర్, జిల్లా కార్యదర్శి డేగల భీమన్న, మైనార్టీ సెల్ నియోజకవర్గ నాయకుడు ముస్తఫా, అధికార ప్రతినిధి ఎండీ సద్దాం, ఇచ్చోడ పట్టణ అధ్యక్షుడు షేక్ బాబా పాల్గొన్నారు.

నేటి నుండి రంజాన్ కిట్ల పంపిణీ

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ప్రతి ఏడాది లాగానే ఈ ఏడాది సైతం మాజీ మంత్రి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిరుపేద ముస్లింలకు రంజాన్ కిట్లను పంపిణీ చేయడం జరుగుతుందని మాజీ మార్కెట్ చైర్మెన్ సంజీవరెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు.గత 15 సంవత్సరాలుగా నిరుపేదలకు రంజాన్ కిట్లను పంపిణీ చేస్తున్నామన్నారు. ఈనెల 16 నుండి పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరుగుతుందన్నారు. ప్రతి రోజు ఆదిలాబాద్ పట్టణంలోని నాలుగు వార్డుల చొప్పున పంపిణీ చేస్తామన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు అంబకంటి అశోక్, దిగంబర్ పాటిల్, సాజిద్ ఖాన్, వసీం, పాల్గొన్నారు.

యువకులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి ర్యాలీలో జరిగిన ఘర్షణకు దారితీసిన కారకులను వెంటనే శిక్షించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ డిమాండ్ చేశారు. శనివారం డీఎస్పీని కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఆదిలాబాద్‌లో సామరస్య పూర్వక వాతావరణం నెలకొని ఉందని, కానీ రాజకీయ పార్టీలు తమ లబ్దికోసం సామాజిక వర్గాల మధ్య చిచ్చు పెట్టడం అమానుషమన్నారు. సదరు యువకులపై దాడి చేసిన వారిని వెంటనే పట్టుకోవాలని వారికి కఠినమైన శిక్ష విధించాలని కోరారు. డీఎస్పీని కలిసిన వారిలో బీజేపీ జిల్లా నాయకులు రాళ్ల బండి మహేందర్, జోగు రవి, దినేష్ మాటోలియా, రాకేష్, సాయి, రఘుపతి, శివ, ప్రవీణ్, నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

సారంగాపూర్‌లో ఈదురుగాలుల బీభత్సం



నవతెలంగాణ- సారంగాపూర్

మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి ఈదురుగాలి తో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో సాయి నగర్(ఉరగుట్ట)పై ఉన్న పేదల ఇండ్ల పై కప్పు రేకులు లేచిపోయాయి. గుడిసెలు కూలిపోయి ఇంట్లోని నిత్యావసర సరుకులు తడిసిపోయాయి. బాధిత పేదలు రాత్రంతా బిక్కుబిక్కుమంటూ గడిపారు. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ సుజాత నర్సారెడ్డి శనివారం ఉదయం వెళ్ళి రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వగా ఆర్.ఐ ముంతాజ్ ఇండ్లను సందర్శించి పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు. నష్ట పోయిన వారికి పరిహారం అందేలా చూస్తామని రెవెన్యూ అధికారులు తెలిపారు.

షాట్ సర్క్యూట్‌తో ప్రమాదం

నవతెలంగాణ- కడెం

కడెం మండలంలోని నర్సాపూర్ గోండ్‌గూడెంలో శనివారం తెల్లవారుజామున నర్సాపూర్ గ్రామ సర్పంచ్ కుడిమెత బాదురావ్ ఇంట్లో ప్రమాదవశాత్తు విద్యుత్ షాట్ సర్క్యూట్ సంభవించి అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో డబుల్‌కాట్ మంచాలు, బీరువా, బట్టలు, నిత్యావసర సరుకులు, ఇంటి సామగ్రి కూలిపోయింది. సుమారు రూ.50వేల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు, స్థానిక సర్పంచ్ కుడ్మెత బాదురావు తెలిపారు.

రిమ్స్ ఎదుట హిందూ సంఘాల ఆందోళన

- రెండు గ్రూప్‌ల ఘర్షణలో నలుగురు అరెస్ట్ : డీఎస్పీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలో శుక్రవారం నిర్వహించిన అంబేద్కర్ జయంతోత్సవ ర్యాలీలో ఓగ్రూప్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ హిందూ సంఘాల ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం రిమ్స్ ఎదుట ఆందోళన చేపట్టారు. హిందువులపై దాడి చేసిన గ్రూప్ సభ్యులను పట్టుకొని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. దాదాపు రెండు గంటల పాటు జరిగిన ఈ రాస్తారోకోలో దారి పొడవున వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు రంగ ప్రవేశం చేసి యువకులను అరెస్ట్ చేయడానికి ప్రయత్నించగా ఇతర యువకులు అడ్డుకున్నారు. పోలీసు వాహనం ముందుకెళ్లకుండా వాహనం ఎదుట బైఠాయించారు. దీంతో ఆందోళన ఘటనకు డీఎస్పీ ఉమెందర్ చేరుకొని సముదాయించారు. అయినప్పటికీ యువకులు వినలేదు. దాడి చేసిన వారిని అరెస్టు చేశామని చెప్పిన వినలేదు మీడియా ముఖంగా చెప్పాలని డిమాండ్ చేశారు. దీంతో డీఎస్పీ టూ టౌన్ పోలిస్ స్టేషన్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. శుక్రవారం జరిగిన దాడిలో పిట్టలవాడ కాలానికి చెందిన సాయి అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు తైవాన్, షాహిద్, అబ్బు అలాగే మరో యువకుడు నలుగురిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామన్నారు. దాడి చేసిన వారిలో మరి కొంతమంది యువకులు ఉన్నారని వీడియో ఆధారంగా వారిని పట్టుకుని అరెస్ట్ చేస్తామని తెలిపారు. దీంతో యువకులు అక్కడి నుండి వెళ్లిపోయి ఆందోళన విరమించారు. రిమ్స్ ఎదుట చేపట్టిన ఆందోళనకు బీజేపీ రాష్ట్ర నాయకురాలు సుహాసినిరెడ్డి మద్దతు తెలిపి కారకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్



అగ్ని ప్రమాదాల నివారణ వారోత్సవాలను పురస్కరించుకొని ఆ శాఖ సిబ్బంది ప్రమాద నివారణను అరికట్టే విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. శనివారం స్థానిక తెలంగాణ తల్లి చౌరస్తాలో ప్రత్యేక ప్రదర్శన నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు జరిగే విధానాలు, వాటిని అరికట్టే పద్ధతులను కూలంకషంగా వివరించారు. ఈనెల 14 నుండి 20వ తేదీ వరకు ప్రత్యేక అగ్ని ప్రమాద నివారణ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రమాదాన్ని బట్టి నివారణ చర్యలు ఉంటాయని, ప్రమాదం చోటు చేసుకున్న సందర్భంలో ఆచితూచి నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. వేసవిలో వస్తువు రాపిడి వల్ల, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఎక్కువ ప్రమాదాలు చోటు చేసుకుంటాయని ప్రజలు గమనించాలని పేర్కొన్నారు. ప్రమాదాలు చోటుచేసుకున్న వెంటనే అగ్నిప్రమాద కేంద్రానికి సమాచారం ఇవ్వాలని, 24 గంటల పాటు అగ్ని ప్రమాద నివారణ కోసం సిబ్బంది అందుబాటులో ఉంటారని వివరించారు. ఈ ప్రదర్శనలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్‌లు టి.హరికృష్ణ, మధుకర్, వెంకటేష్, డ్రైవర్ ఏ. శంకర్, హోంగార్డులు చిన్నయ్య, కృష్ణ ఉన్నారు.

ఐకేపీ వీఓఏల నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ - పెంచికల్‌పేట్

మండల కేంద్రంలోని స్వర్ణభారతి మండల సమాఖ్య కార్యాలయంలో సీఐటీయూ జిల్లా నాయకులు రాజేందర్, కృష్ణమాచారి ఆధ్వర్యంలో శనివారం ఐకేపీ వీఓఏల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా రోజా, కార్యదర్శిగా తులసీరాం, కోశాధికారిగా రవి, ఉపాధ్యక్షుడిగా బాగీలాల్, జాయింట్ సెక్రటరీగా సంగీత, అంకితను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ ఈ నెల 17 నుండి నిర్వహించే రాష్ట్ర నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు.

రంజాన్ కానుకలు పంపిణీ

నవతెలంగాణ-బాసర

మండలంలోని లాబ్ది గ్రామంలో శనివారం సర్పంచ్ కమలాబాయి చేతుల మీదుగా ప్రభుత్వం అందించిన రంజాన్ కానుకలను ముస్లిములకు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు కానుకలు అందిస్తుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో పిఏసిఎస్ డైరెక్టర్ అమృత్ పటేల్, రమేష్‌రావు, బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు మల్లయ్య యాదవ్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఖలీల్ అహ్మద్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ - కౌటాల

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని వీర్దండి సర్పంచ్ మడావి రేణుక అన్నారు. శనివారం వీర్దండి గ్రామంలో చాలామంది జ్వరాలతో బాధపడుతుండడంతో గుండాయిపేట్ సబ్‌సెంటర్ వైద్యురాలు ప్రవళికతో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ శిబిరంలో 20 మందికి మలేరియా, రక్త నమూనాలను సేకరించి వైద్య పరీక్షలు నిర్వహించారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కవ్వాల్ అభయారణ్యంలో జంగల్ సఫారీ

- పర్యాటకులకు అందుబాటులోకి సఫారీ
- వీక్షించేందుకు నాలుగు వాచ్ టవర్ల ఏర్పాటు
- ప్రత్యేక చర్యలు తీసుకుంటున్న అటవీశాఖ





నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్

పర్యాటకులకు ఆనందాన్ని, అహ్లాదాన్ని పంచేందుకు అటవీశాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. కవ్వాల్ అభయారణ్యం అంటేనే రాష్ట్రంలో ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. దీనిని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు అటవీశాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. వీక్షకులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తుంది. అందులో భాగంగానే కవ్వాల్ అభయారణ్యాన్ని పర్యాటకులు అటవీ అందాలను, అందులోని పక్షులు, వివిధ రకాల జంతువులను వీక్షించేందుకు వీలు కల్పిస్తోంది. అదేవిధంగా అటవీలోని జంతువులకు రక్షణ కల్పించేందుకు వాటికి సాసర్‌లు నిర్మించి, తాగు నీటి సౌకర్యాన్ని కల్పిస్తుంది. పర్యాటకులకు కవ్వాల్ అభయారణ్యం ముఖ ద్వారం రాగానే ఒక అనుభూతి కలుగుతుంది. అక్కడ పర్యాటకులు ఫోటోలు దిగుతూ తమ జ్ఞాపకాలను, వాట్సప్‌లో షేర్ చేసుకుంటున్నారు. ముఖ ద్వారం వద్దనే ఇంతగా అనుభూతిని పొందుతున్నారంటే ఇక కవ్వాల్ అభయారణ్యంలోకి వెళ్తే ఆ సంతోషాన్ని వేల కట్టలేము. అలాంటి సౌకర్యాలను కల్పించేందు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తుంది. అందులో భాగంగానే అభయారణ్యంలో ప్రత్యేకంగా జంగల్ సఫారీని ఏర్పాటు చేస్తున్నారు. ఈ సఫారీ అభయారణ్యంలో తిరుగేందుకు వీలుగా ప్రత్యేకంగా రెండు ట్రాక్‌లను ఏర్పాటు చేస్తున్నట్టు ఎఫ్‌డీఓ కోటేశ్వర్‌రావు పేర్కొన్నారు. అటవీ క్షేత్రం పరిధిలో 12 గడ్డి క్షేత్రాలతో పాటు వాటర్ సాసర్ల నిర్మాణం చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. జంగల్ సఫారీ రెండు ట్రాక్‌లుగా విభజించినట్లు, పర్యాటకుల సౌకర్యం కోసం నాలుగు వాచ్ టవర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ క్షేత్రం పూర్తిగా జంగల్ సఫారీలో విహరించవచ్చనీ, మొత్తానికి జంతు ప్రేమికులకు కనువిందు చేసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పక్షి, జంతు ప్రేమికులు ఆహ్లాదకరమైన వాతావరణంలో గడిపే విధంగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. యాత్రికులకు క్షేత్రంగా మారే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని చూపరులు ఆకర్షించే విధంగా ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

త్వరలోనే జంగల్ సఫారీ ప్రారంభం...

కోటేశ్వరరావు, ఎఫ్‌డీఓ

కవ్వాల్ అభయారణ్యంలో త్వరలోనే జంగల్ సఫారీ పూర్తిస్థాయిలో ప్రారంభించనున్నాం. దానికోసం అన్ని ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వీక్షకులకు కనువిందు అయ్యేలా ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాం.



వార్షిక పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



నవతెలంగాణ- ఆదిలాబాద్‌టౌన్

పదో తరగతి, ఇంటర్మీడియేట్ ఓపెన్ స్కూల్ వార్షిక పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ, విద్యా, వైద్య, విద్యుత్, పోలీస్, ఆర్టీసి, తపాలా, సంబంధిత శాఖల అధికారులతో ఓపెన్ స్కూల్ వార్షిక పరీక్షల నిర్వహణపై ముందస్తు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 25 నుండి మే 4 వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30గంటల వరకు పదవ తరగతి, ఇంటర్మీడియేట్ ఓపెన్ స్కూల్ వార్షిక పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మే 12 నుండి 19 వరకు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియేట్ ఓపెన్ స్కూల్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, అందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో 4 పదవతరగతి పరీక్షా కేంద్రాలలో 987 మంది, 3 ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలలో 549 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా, ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాసేవిధంగా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని అన్నారు. పరీక్షా హాల్ లోకి సెల్ ఫోన్, స్మార్ట్ వాచ్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించవద్దని, పరిశీలించి హాలులోకి విద్యార్థులను, సంబంధిత సిబ్బందిని మాత్రమే అనుమతించాలని సూచించారు. పరీక్షలు నిర్వహించే సమయంలో సమీప ప్రాంతాల్లోని జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని, అలాగే పరీక్షా కేంద్రాల పరిధిలో 144సెక్షన్ అమలు చేయాలని స్పష్టం చేశారు. పరీక్షల నిర్వహణ, ప్రశ్నా పత్రాలు తరలించే సమయంలో, స్ట్రాంగ్ రూమ్ వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. పరీక్షా సమయానికి ముందే విద్యార్థులు ఆయా కేంద్రాలకు చేరుకునే ఆయా రూట్లలో సమయానుకూలంగా బస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. జవాబు పత్రాలను సంబంధిత కేంద్రాలకు తరలించే సమయంలో పోలీస్, పోస్టల్ అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఇంచార్జ్ డిఆర్‌ఓ అరవింద్ కుమార్, విద్యాశాఖ ఎడి నర్సింలు, డిపిఆర్వో ఇ.విష్ణువర్ధన్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ జె.కృష్ణమూర్తి, ఓపెన్ స్కూల్ జిల్లా కో- ఆర్డినేటర్ అశోక్, ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన, కలెక్టరేట్ పర్యవేక్షకులు రాంరెడ్డి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్ వైద్యులపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఆదివాసీ మహిళా పురిటి నొప్పులతో ప్రభుత్వ ఆసుపత్రి వస్తే పురుడు పోయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించి రిమ్స్ ఆసుపత్రి నుండి వెళ్లగొట్టిన వైద్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పూసం సచిన్, రాష్ట్ర నాయకులు లంకా రాఘవులు డిమాండ్ చేశారు. వారిని ఉద్యోగం నుంచి తొలగించడమే కాకుండా రిమ్స్ డైరెక్టర్ రాజీనామా చేయాలని స్పష్టం చేశారు. శనివారం ఆదిలాబాద్ లోని ఓ ప్రయివేట్ హాస్పిటల్‌లో బాధిత మహిళా, వారి కుటుంబ సభ్యులను కలిసి వివరాలు తెలుసుకొని మాట్లాడారు. సుందరగిరికి చెందిన ఆదివాసీ మహిళా పురిటి నొప్పులతో ప్రభుత్వ ఆస్పత్రికి వస్తే కనీస పట్టింపుతనం లేకుండా బయటకు పంపించడం శోచనీయమన్నారు. రిమ్స్ వైద్యుల తీరుకు అద్దం పడుతోందని పేర్కొన్నారు. సమయానికి ప్రయివేటు ఆసుపత్రికి వెళ్లకపోతే తల్లి బిడ్డ ప్రాణాలు రెండు దక్కేవి కావన్నారు. ఇప్పుడు ఆ నిరుపేద ఆదివాసీ మహిళకు డాక్టర్‌ల నిర్లక్ష్యం కారణంగా కెసిఆర్ కిట్, ఇతర ప్రభుత్వం నుండి అందాల్సిన సహాయం అందక మళ్ళీ ప్రయివేటు ఆసుపత్రి బిల్లు భారం పడిందన్నారు. కూలి నాలి చేసుకొని బతికే ఆదివాసీలు ప్రైవేట్‌లో వైద్యం చేయడానికి వారి బంగారాన్ని అమ్మాల్సిన దుస్థితి ఏర్పడింది అని పేర్కొన్నారు. బాధిత మహిళకు ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ప్రభుత్వం గర్భిణీలకు అందించే పథకాలను వర్తింపజేయాలని వారికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు బైరి సోమేశ్, రాజు ఉన్నారు.

సకల వస్తువుల సమ్మేళనమే క్రాఫ్ట్ ఇండియా



నవతెలంగాణ- ఆదిలాబాద్ అర్బన్



పట్టణంలోని డైట్ మైదానంలో ఏర్పాటు చేసిన క్రాఫ్ట్ ఇండియా షాపింగ్ మాల్‌లో అన్ని రకాల చేనేత, హస్తకళ వస్తువులు లభిస్తున్నాయి. కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు గల అన్ని రకాల చేనేత, హస్తకళ వస్తువులు సుమారు 50 వేల పైచిలుకు రకాలు క్రాఫ్ట్ ఇండియా లో లభించడం విశేషం. ఫ్యాన్సీ జ్యువెలరీ, ఫ్యాన్సీ చప్పల్, టాటూ అండ్ మెహందీ, ప్రసిద్ధ మీరట్ ఖాదీ, మొబైల్ ఫ్యాన్సీ బ్యాగ్, ఫార్మల్ జీన్స్ పంత్, రాజస్థానీ ఆచార్ ఎన్, గుజరాతీ నంకిన్, రాజ్కోట్ హస్తకళ పెయింటింగ్, రోజువారీగా ఉపయోగించే ఇతర వస్తువులు ఇలా అనేక రకాలు అందుబాటులో ఉన్నాయి. క్రాఫ్ట్ ఇండియా షాపింగ్ ఉదయం 10 గంటల నుంచి రాత్రి పది గంటల వరకు ఉంటుందని, ఇంకా కొద్దిరోజులు మాత్రమే పట్టణంలో తమ క్రాఫ్ట్ ఇండియా ఉండనున్న నేపథ్యంలో వాణిజ్యపరంగా స్థానిక ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని నిర్వాహకులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

నేడు తలమడుగులో దివ్యాంగుల బస్‌పాస్ మేళా

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

దివ్యాంగులకు బస్ పాస్ కోసం ఈ నెల 16న ఆదివారం తలమడుగు మండల కేంద్రంలో ప్రత్యేక మొబైల్ కౌంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆదిలాబాద్ డిపో మేనేజర్ కల్పన ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 50 రుసుము చెల్లించాలని, పాస్ పోర్ట్ ఫొటో, ఆధార్ కార్డు జిరాక్స్, సదరం సర్టిఫికెట్ తీసుకొని రావాలన్నారు. నూతనంగా దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ తీసుకున్నవారు, గతంలో తీసుకొని గడువు అయిపోయిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గోదావరి ఘాట్లను పరిశీలించిన ఆలయ ఈఓ



నవతెలంగాణ- బాసర

గోదావరి నది తీరాన ఘాట్లను శనివారం ఆలయ ఈవో విజయరామారావు అధికారులతో కలిసి పరిశీలించారు. వేసవికాలం ఎండలు ముదురుతుండడంతో నదిలో పుణ్య స్నానాల కోసం ఎదురయ్యే ఇబ్బందులను పరిశీలించారు. పుణ్యస్నానాలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, గోదావరి ఘాట్లపై పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఈఓ ఆదేశించారు. మెట్లపై షవర్లను ఏర్పాటు చేసి భక్తులు స్నానాలు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గోదావరి నదికి వచ్చే భక్తులకు శుద్ధమైన తాగునీరును అందించేందుకు దివిస్ కంపెనీ వారు వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేశారని తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. వీరి వెంట ఆలయ ఏఈఓ సుదర్శన్ గౌడ్ సిబ్బంది పాల్గొన్నారు.

కనీస వేతనం చెల్లించాలి

నవతెలంగాణ- నిర్మల్

ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్లు, క్లీనర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కె. రాజన్న అన్నారు. శనివారం భగత్ సింగ్ భవన్లో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకుండా వారి జీవితాలతో చెలగాటమాడుతున్నాయన్నారు. ప్రతి ఐదు సంవత్సరాలకు ఓసారి కనీస వేతనాల జీవోలను సవరించాలని ఉన్నప్పటికీ వాటిని ప్రకటించకుండా కాలయాపన చేస్తున్నారని, దీంతో కార్మికులకు అన్యాయం జరుగుతోందని తెలిపారు. ఈ జీవోలు ప్రకటించకపోవడంతో యాజమాన్యాలకు లబ్ధి కోరే విధంగా ఉపయోగపడుతున్నాయని మండిపడ్డారు. కార్మిక చట్టాలను నాలుగు కోడ్ లుగా చేస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని, వారి కనీస వేతనాలను అమలు చేయకుండా కుట్ర పన్నుతున్నారని అన్నారు. కార్పొరేట్ ప్రయోజనాలనే కాపాడుతున్నారని తప్ప కార్మికుని భద్రతకై హక్కులకై మాట్లాడలేదని అన్నారు. రోజురోజు ధరలు పెరుగుతూ సామాన్య ప్రజలు బతకలేని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కిషన్, కార్యదర్శి సాయన్న, లక్ష్మణ్ రమేష్, కృష్ వర్మ పాల్గొన్నారు.

'మహేశ్వర్‌రెడ్డి వెళ్తే కాంగ్రెస్‌కు నష్టం లేదు'

నవతెలంగాణ- ఖానాపూర్ టౌన్

ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మెన్‌గా పనిచేసిన ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పార్టీని విడిచి బీజేపీ లో చేరడంతో కాంగ్రెస్‌కు వచ్చిన నష్టమేమీ లేదని మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చిన్న సత్యం తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇంతకాలం సెక్యూలర్ నాయకునిగా పేరుతెచ్చుకున్న మహేశ్వర్ రెడ్డి మతతత్వ బీజేపీలో చేరి పేరు చెడగొట్టుకున్నారని ఆరోపించారు. అవకాశవాద రాజకీయాలకు అద్దంపట్టే ఆయన పార్టీని వీడటమే తమ పార్టీకి మంచిదని అన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రం, జిల్లాలో కాంగ్రెస్ పార్టీ కొత్త ఒరవడిని సృష్టించి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు దొనికెని దయానంద్, నిమ్మల రమేష్, యూసుఫ్ ఖాన్, తోట సత్యం, షబ్బీర్ పాషా, కడార్ల గంగనర్సయ్య, మడిగెల గంగాధర్, జహీర్ ఉన్నారు.

ఆదిలాబాద్ మీదుగా ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ ర్యాలీ

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

తెలంగాణ రాష్ట్ర రాజధాని భాగ్యనగర్ నుండి మధ్యప్రదేశ్ ఉజ్జయిని వరకు 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' యాత్రను బీజేపీ జాతీయ నాయకులు, మధ్యప్రదేశ్ ఇంచార్జ్ మురళీధర్‌రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం ఆదిలాబాద్ చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు పాయల శంకర్ ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం శ్రీ సరస్వతి శిశు మందిర్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మురళీధర్‌రావు మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సాంప్రదాయాలు వివిధ ప్రాంతాల్లో పలు రకాలుగా ఉంటాయని వీటన్నింటిని ఏకీకరించడం ముఖ్య ఉద్దేశ్యం అని తెలిపారు. శతాబ్దాలుగా విదేశీ దండయాత్రలు జరిగిన బలవంతంగా విదేశీ పాలకుల చేతిలో వారి సాంప్రదాయాలు మనపై బలవంతంగా రుద్దపడ్డాయన్నారు. వేల సంవత్సరాలుగా వివిధ ప్రాంతాల్లో వివిధ సంస్కృతులు నిలబడి ఉన్నాయని, ఇది మన దేశ ప్రత్యేకత అని అన్నారు. దేశంలోని మేధావులు, శాస్త్రవేత్తలు సామాజిక కార్యకర్తలు దాదాపు 400 మంది భాగ్యనగర్ నుండి నరేంద్ర మోడీ పిలుపు మేరకు భారత్ దర్శన్ యాత్ర ప్రారంభమైందని, ఈ యాత్ర ఏప్రిల్ 21 నాటికి ఉజ్జయిన్ చేరుకుంటుంది అన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకురాలు సుహాసినిరెడ్డి, జిల్లా నాయకులు లోక ప్రవీణ్ రెడ్డి, ఆకుల ప్రవీణ్, జోగు రావి, సోమ రావి, రాజేష్, ముకుంద్, మయూరి చంద్ర, దినేష్ మాటోలియా, వేదవ్యాస్, చిలుకూరి జ్యోతిరెడ్డి, ధోని జ్యోతి, రత్నాకర్ రెడ్డి, మహేందర్ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాయిల్డ్ రైస్‌మిల్లు పనులు నిలిపేయాలి

నవతెలంగాణ - దహెగాం



మండల కేంద్ర సమీపంలో సర్వే నెంబర్ 287లో చేపడుతున్న బాయిల్డ్ రైస్‌మిల్ నిర్మాణ పనులను నిలిపివేయాలని పలువురు రైతులు డిప్యూటీ తహసీల్దార్ బక్కయ్యకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాయిల్డ్ రైస్‌మిల్లు వల్ల పంట పొలాలకు, ప్రజలకు భవిష్యత్తులో తీవ్ర నష్టం వాటిల్లుతుందని, వెంటనే నిర్మాణ పనులను నిలిపివేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు రాపర్తి ధనుంజయ్, మోర్లె కార్తీక్, రాజు, రమేష్, శ్యాంరావు, పోశన్న, కృష్ణ పాల్గొన్నారు.

మైనార్టీ దివ్యాంగుల రుణాలకు ఇంటర్వ్యూలు

నవతెలంగాణ - పెంచికల్‌పేట్

మండల కేంద్రంలోని రైతువేదికలో శనివారం మైనార్టీ దివ్యాంగుల రుణాలకు ఇంటర్వ్యూను ఎంపీడీఓ గంగాసింగ్, తెలంగాణ దక్కన్ గ్రామీణ బ్యాంకు మేనేజర్ రాజేశ్వర్‌రావు నిర్వహించారు. రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్టు ఎంపీడీఓ తెలిపారు.

కార్మిక సమస్యలపై ఖర్గేకు వినతి పత్రం



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణిలో కార్మికుల దీర్ఘకాలిక సమస్యలపై ఏఐసీసీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్, వేజ్ బోర్డు సభ్యులు జనక్ ప్రసాద్ ఆధ్వర్యంలో సీసీసీ సింగరేణి గెస్ట్‌హౌస్‌లో శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ కేంద్ర ఉపాధ్యక్షులు జెట్టి శంకర్‌రావు, నాయకులు కలవేన శ్యాం, సమ్మయ్య, భూమయ్య, నరేందర్, రవి పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

మంచిర్యాల

కుమురం భీం-ఆసిఫాబాద్

ఆదివారం 16 ఏప్రిల్ 2023

గనిని సందర్శించిన ఆడిట్ కమిటీ

నవతెలంగాణ-కాసిపేట

మందమర్రి ఏరియాలోని కాసిపేట గనిని ప్రీ మాన్ సూన్ (రుతుపవనాల వల్ల సంభవించే నివారణ) ఆడిట్ కమిటీ సందర్శించింది. ఈ సందర్భంగా గనిని, కాసిపేట టన్నల్, సాండ్ స్టోవింగ్ బంకర్లను దగ్గరగా ఉన్న కాసిపేట, దేవాపూర్ వాగును, చిన్న ధర్మారం చెరువును పరిశీలించి పలు సూచనలు చేశారు. కమిటీ కన్వీనర్ పీహెచ్ వెంకట రమణ, సభ్యులు జైలావుద్దీన్, గని మేనేజర్ అల్లావుద్దీన్, రక్షణాధికారి సునీల్ కుమార్, సర్వేయర్ వెంకటేశ్వరరావు, మహబూబ్ ఖాన్ పాల్గొన్నారు.



ఓపెన్ పరీక్షలను సజావుగా నిర్వహించాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కడే హేమంత్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ఈనెల 25 నుండి మే 4వ తేదీ వరకు జరగనున్న ఓపెన్ 10వ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలను సజావుగా నిర్వహించాలని ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. శనివారం జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్ పాయితో కలిసి సంబంధిత అధికారులతో పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఓపెన్ 10వ తరగతి పరీక్షల కొరకు ఆసిఫాబాద్‌లో 1, కాజజ్‌నగర్‌లో 1, ఓపెన్ ఇంటర్మీడియట్ కొరకు ఆసిఫాబాద్‌లో 1, కాగజ్‌నగర్‌లో 2 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పరీక్ష కేంద్రాలలో త్రాగునీరు, విద్యుత్ సరఫరా, వేసవికాలం దృష్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, వైద్య సిబ్బంది నియమించి అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని, విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి అశోక్, జిల్లా ఇంటర్మీడియట్ విద్య అధికారి శ్రీధర్ సుమన్, పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

గత సంవత్సరం దహెగాం మండలంలోని పెసరకుంటలో రెస్క్యూ విధులు నిర్వహిస్తూ, వరదల్లో చిక్కుకున్న ప్రజలను కాపాడబోయే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు మరణించిన అంబాల రాము జ్ఞాపకార్థం అతని త్యాగాన్ని స్మరిస్తూ అతని మిత్ర బృందం శనివారం రామాలయం చౌరస్తాలో అమరవీరుల స్తూపం వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైట్ టు హెల్త్ ఫోరం అధ్యక్షులు, అడ్వకేట్ రాజలింగు మోతె మాట్లాడుతూ అంబాల రాము జ్ఞాపకార్థం అతని మిత్రబృందం చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం చాలా హర్షనీయమని, చలివేంద్రాన్ని బాటసారులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చలివేంద్రం నిర్వాహకుడు ఆవుల రమేష్, డీజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలశ్రీనివాస్, తెలంగాణ బలహీనవర్గాల సంక్షేమ సంఘం నాయకులు ఏల్పుల వెంకటస్వామి, మహేందర్, ముస్లిం మైనార్టీ సంఘం నాయకులు అసన్ మియా పాల్గొన్నారు.

బిడ్డకు అదనపు ఆహారాన్ని అందించాలి

నవతెలంగాణ-తాండూర్

పసిబిడ్డలు ఎదుగుతున్న క్రమంలో వారికి అదనపు ఆహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత అన్నారు. శనివారం తాండూర్ మండలంలోని మాదారం-4 అంగన్వాడీ సెంటర్‌లో అన్నప్రాసన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు ఆరు నెలల తర్వాత బిడ్డ ఎదుగుతున్న క్రమంలో పాలతో పాటు అదనపు ఆహారం అవసరమవుతుందని తెలిపారు. బియ్యం, పప్పు ధాన్యాలు మిశ్రమాన్ని మెత్తగా చేసి పాక్షిక గణపార్థంగా అందించడం వల్ల బిడ్డలో ఎదుగుదల కనిపిస్తుంద న్నారు. బిడ్డ ఎదుగుదల, జీర్ణ ప్రక్రియను పర్యవేక్షిస్తూఅదనపు ఆహారాన్ని సరిపోయేంత అందించాలని తెలిపారు. కమ్యూనిటీ బేస్డ్ ఈవెంట్స్‌లో భాగంగా ధనలక్ష్మి హనుమంతు కూతురు ద్వారాక్షికి అన్నప్రసన చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ మమత, టీచర్ విజయలక్ష్మి, ఆయా తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-లక్షెట్టిపేట్

పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన రాచర్ల అజయ్(40) బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై లక్ష్మణ్ శనివారం సాయంత్రం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతునికి 40 సంవత్సరాల వయస్సు వచ్చిన పెళ్లి కాకపోగా మనస్తాపం చెంది మద్యానికి అలవాటు పడి, గత రెండు రోజుల క్రితం మద్యం మత్తులో అంకతివాడలో గల వ్యవసాయ బావిలో పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు పట్టణంలోని ఓ కిరాణా షాప్‌లో పనిచేసే వాడని, రెండు రోజులుగా ఇంటికి రాకపోవడంతో ఇంట్లో వాళ్లు బంధువుల ఇండ్లలో వెతికిన ఆచూకీ దొరకలేదు. శనివారం ఉదయం అజయ్ శవం బావిలో కనిపించడంతో తన తండ్రి చిలకయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

జైలు జీవితంతో ప్రవర్తనలో పరివర్తన రావాలి

- సీనియర్ సివిల్ జడ్జి వెంకటేష్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జైలు జీవితంతో ఖైదీల ప్రవర్తనలు పరివర్తన రావాలని సీనియర్ సివిల్ జడ్జ్ వెంకటేష్ సూచించారు. జిల్లా కేంద్రంలోని సబ్ జైలును సందర్శించారు ఈ సందర్భంగా ఖైదీలకు అందిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో అను మాట్లాడుతూ జైలు జీవితం ఖైదీలో పరివర్తన తీసుకురావాలని తెలిపారు. క్షణికావేశంలో చేసిన తప్పుల వల్ల ఒక కుటుంబం రోడ్డున పడుతుందని అన్నారు. జైలులో నేర్చుకున్న పలు మంచి అంశాలు నిత్య జీవితంలో అనువర్తింప చేసుకోవాలని సూచించారు. నేర ప్రవత్తి వల్ల సమాజంలో గుర్తింపు కోల్పోయే ప్రమాదం ఉంటుందన్నారు. చట్టాలపై ఖైదీలు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ నరహరి జైలు సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్ మిషన్ శిక్షణ ప్రారంభం

నవతెలంగాణ-కాసిపేట

మండల పరిషత్ కార్యాలయంలో శనివారం గ్రామీణ స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా చేయాల్సిన పనులపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఓడీఎఫ్ ప్లస్ గ్రామాలుగా తీర్చిదిద్దడానికి లక్ష్యంపై జిల్లా స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ సమన్వయ కర్త రాజేందర్ అంశాలపై శిక్షణ ఇచ్చారు. బహిరంగ మల విసర్జన రహిత గ్రామాలుగా తీర్చి దిద్దడానికి చేయాల్సిన విధానాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంఎ అలీం పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మూడవసారి బార్ అసోసియేషన్ అధ్యక్షుడుగా ఎన్నికైన భోనగిరి సతీశ్ బాబును బీజేవైఎం ఆధ్వర్యంలో శనివారం సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మూడోసారి ఏన్నిక కావడం అభినందనీయమని అన్నారు. న్యాయవాదుల సమస్యల పరిష్కారం గూర్చి బార్ అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది నరహరి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏలగతి సుచిత్, బీజేపీ లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ జుమిడి రాజేష్, బీజేవైఎం మండల అధ్యక్షుడు వికాస్‌లు పాల్గొన్నారు.

జోరుగా ఆన్‌లైన్ బెట్టింగ్..!

- ఆర్థికంగా చితికిపోతున్న యువత
- మైనర్లు, మహిళలూ బాధితులే
- పల్లెల్లో సైతం జోరుగా ఐపిఎల్ బెట్టింగ్
- ఆందోళనలో తల్లిదండ్రులు



నవతెలంగాణ-హాజీపూర్

జిల్లాలో క్రికెట్ బెట్టింగ్ జోరుగా సాగుతోంది. ప్రత్యక్షంగా బుకీలు నడిపిస్తున్నప్పటికీ పరోక్షంగా పలువురి అండదండలు ఉన్నట్టు తెలుస్తోంది. నూతన సాంకేతిక టెక్నాలజీ ఉపయోగించుకుని బెట్టింగ్ ద్వారా రోజు రూ.కోట్లు చేతులు మారుతున్నట్లు సమాచారం. నేరుగా క్యాష్ కాకుండా ఈసారి లావాదేవీలు ఎక్కువ డిజిటల్ పేమెంట్లలోనే జరుగుతున్నాయి. ప్రస్తుతం ఐపీఎల్ క్రికెట్ పోటీలు జోరుగా సాగుతున్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రోజూ కోట్లలో బెట్టింగ్ జరుగుతున్నట్లు తెలుస్తోంది. బెట్టింగుల ఫలితంగా కొందరు ఆర్థికంగా చితికిపోయి అప్పులపాలు కావడంతో వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. బెట్టింగ్ ఒకప్పుడు ప్రధాన పట్టణాలకే పరిమితం అయ్యేది. అయితే ఇప్పుడు ఆండ్రాయిడ్ ఫోన్ల పుణ్యమా అని పల్లెలకు కూడా పాకింది. ఇంట్లో కూర్చుని టీవీ చూస్తూ బెట్టింగ్ ఆడే అందరూ దీనికి బానిసలవుతున్నారు. ఒకప్పుడు చదువుకునే వ్యక్తులు. నిరుద్యోగులు, విద్యార్థులు ఈ మహమ్మారి బారిన పడేవారు. అయితే ఇప్పుడు రోజువారి కూలీలు మొదలుకుని కొందరు మహిళలు కూడా బెట్టింగ్‌కు పాల్పడుతునడడం గమనాహర్హం.

స్మార్ట్ ఫోన్‌లలో తేలికగా బెట్టింగ్.

స్మార్ట్ ఫోన్‌లలో బెట్టింగ్ యాప్‌లు కుప్పలు, తెప్పలుగా ఉన్నాయి. ఇవన్నీ ప్లేస్టోరులో ఉండక పోవడం గమనార్హం. కేవలం గూగుల్లోనే లభ్యమవుతాయి. వీటిలో కొన్ని బెట్టింగ్ యాప్లను పరిశీలిస్తే.. స్కై ఎక్సేంజ్, ఎబిబి 247, లార్డ్స్ ఎక్సేంజ్, లోటాస్ బుక్ 247, డ్రీమ్ లేవెన్, మాక్స్ తదితర యాప్‌లు ఉన్నాయి. యాప్ బెట్టింగ్ ఆడాలంటే తొలుత ఆ లింకును క్లిక్ చేస్తే మన వివరాలు పొందుపరుస్తూ లాగిన్ అవ్వాలి. యాప్ నిర్వాహకులు మనకు యూజర్ ఐడి, పాస్వర్డ్ పంపుతారు. మనం పాస్వర్డ్ చేంజ్ చేసుకోవచ్చు. వెంటనే మనం బెట్టింగ్ ఆడేందుకు మనం డబ్బులు డిపాజిట్ చేసేందుకు గాను డిజిటల్ పేమెంట్ కోసం కొన్ని అకౌంటు నెంబర్లు ఇస్తారు. డిజిటల్ పేమెంట్స్ యాప్ ద్వారా డిపాజిట్ చేయాల్సి ఉంది. మ్యాచ్లో గెలిచిన తరువాత మనం డబ్బు విత్ డ్రా కోసం మన బ్యాంకు వివరాలను అందించాలి. ఇవన్నీ లాగిన్ కావడం పూర్తయితే యాప్లో మ్యాచ్ బెట్టింగ్ ఉంటుంది. ఏ జట్టుపై ఎంత బెట్టింగ్, ఏ బాలు ఎంత.. క్రికెట్ పరిబాషలో ఈటింగ్, బెట్టింగ్ అనే పరిబాషల ద్వారా ఈ బెట్టింగ్ తతంగం సాగుతున్నట్లు తెలుస్తోంది.

పల్లెలకూ విస్తరిస్తున్న బెట్టింగ్ సంస్కృతి

హాజీపూర్ మండలంలో కొందరు యువకులు మధ్యవర్తుల ఆధ్వర్యంలో నగదు రూపేణ కూడా బెట్టింగ్ కాస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా గుడిపెట్ గ్రామ యువకులు ఈ బెట్టింగ్ వుచ్చులో ఎక్కువ మంది చికుకున్నట్లు, బుకీలు బలవంతంగా వారిని ఈ బెట్టింగ్ ఊబిలోకి దించుతునట్లు ప్రచారం జరుగుతుంది. కొందరు యువకులు బైక్, మొబైల్ ఫోన్, ఇతరత్రా విలువైన వస్తువులను కుదువ బెట్టి మరీ బెట్టింగ్ పెడుతున్నట్లు తెలుస్తోంది. ఒకప్పుడు మహానగరాలకే పరిమితమైన స్మార్ట్ ఫోన్లలో తేలికగా బెట్టింగులు బెట్టింగ్ తర్వాత కాలంలో పట్టణాలకు తాజాగా పల్లెలకు విస్తరించింది. యువతే లక్ష్యంగా బుకీలు చక్రంతిప్పుతున్నారు. గతంలో బెట్టింగ్ ఆడాలంటే బుకీల ద్వారా తతంగం నడిచేది. బుకీతోనే సంప్రదింపులు జరిపి బెట్టింగ్ కాసేవారు. అయితే పోలీసులు నిఘా ఎక్కువగా ఉండడంతో బెట్టింగ్ మాఫియా రూటు మార్చింది. యాప్ ద్వారా బెట్టింగ్ కొనసాగిస్తోంది. క్రికెట్ ఆడే రోజుల్లో నిర్వాహకులు, బుకీలు కొన్ని యాప్లను సృష్టించి వాటి ద్వారా తాపీగా ఆడుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. గూగుల్లోకి వెళ్లి బుకీలు పంపిన లింకులను క్లిక్ చేస్తే ఎవరి వివరాలు వారు పొందుపరిస్తే బెట్టింగ్ ఆడుకోవచ్చు. అయితే ఆటలో పాల్గొనేందుకు ముందుగా టోకెన్ అడ్వాన్స్ వసూలు జరుగుతుంది. యాప్ ద్వారా బెట్టింగ్ చాలా ఈజీగా ఉండడంతో సరదా కోసం కొంతమంది యువకులు బెట్టింగ్ కాస్తున్నారు. సిగరెట్, మద్యం మొదలెట్టి దానికి ఎలా బానిసలవుతున్నారు. అలాగే బెట్టింగ్ మొదలు పెట్టి దానికి బలైపోతున్నారు. డబ్బు ఒకసారి గెలుచుకుంటే గంటల వ్యవధిలోనే లక్షాధికారులు కావాలన్న ఆశతో స్థోమత కంటే అప్పులు చేసి బెట్టింగ్ కాస్తున్నారు. మ్యాచ్ ఫలితాలు తలకిందులైతే ఆర్థికంగా నష్టపోతున్నారు. పోలీసు అధికారులు ఆన్‌లైన్ బెట్టింగ్ పై నిఘా పెట్టి చర్యలు తీసుకోవాల్సిన అవసరం వుంది.

పంచాయతీ కార్యదర్శుల సమ్మె నోటీస్



నవతెలంగాణ-దండేపల్లి

జూనియర్ పంచాయతీ కార్యదర్శుల రెగ్యులరైజేషన్ చేయాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శుల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం ఎంపీడీఓ మల్లేశంకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ ప్రొబిషనరి కాలం ఐదు సంవత్సరాలు అయినందున ప్రభుత్వానికి తమను రెగ్యులరైజేషన్ చేయాలని విన్నవించుకున్న పట్టించుకునే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది మరొక సంవత్సరం పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన తాము విధులు నిర్వర్తించామని ఈ ఏడాది పొడిగించిన సంవత్సర కాలం కూడా పూర్తి అయిన రెగ్యులరైజేషన్ చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శుల న్యాయమైన డిమాండ్లు వెంటనే నెరవేర్చాలన్నారు. పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేస్తూ జీవో విడుదల చేసి గడిచిన నాలుగు సంవత్సరాలు ప్రొబిషనరి కాలాన్ని సర్వీస్ కాలంగా గుర్తించాలని కోరారు. ఔట్సోర్సింగ్‌లో పంచాయతీ కార్యదర్శులుగా పని చేస్తున్న వారిని ప్రమోట్ చేస్తూ జూనియర్ పంచాయతీ అధికారులుగా గుర్తిస్తూ వారినీ కూడా రెగ్యులర్ చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శుల కేడర్ స్ట్రెంత్ నిర్ధారించి ప్రకటించాలని అన్నారు. మరణించిన పంచాయతీ కార్యదర్శుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. అర్హులైన పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు చేపట్టి, 317 జీవోతో నష్టపోయిన కార్యదర్శులకు న్యాయం చేయలని డిమాండ్ చేశారు.

హాజీపూర్ : జూనియర్ పంచాయతీ సెక్రెటరీలు తమ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 28 నుండి సమ్మె చేయనున్నట్టు శనివారం ఎంపీడీఓ అబ్దుల్‌హైకి సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులర్ చేస్తూ జీవో విడుదల చేయాలని, గడిచిన నాలుగేండ్ల కాలాన్ని సర్వీస్ కాలంగా గుర్తించాలన్నారు. ఓపీఎస్‌లను జేపీఎస్‌లుగా పరిగణించాలన్నారు. మరణించిన జూనియర్ పంచాయతీ కార్యదర్శుల కుటుంబాలకు కారుణ్య నియామకం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మల్లేష్, శ్రీనివాస్, సాయిరాం, గణేష్, హారిక, రాజమణి, స్వరూప పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : ప్రభుత్వం 2021లో జారీ చేసిన జీవో ప్రకారం 11 ఏప్రిల్ 2023 నుండి తమ సర్వీసులు రెగ్యులర్ చేయాలని వెంటనే దానికి సంబంధించిన ఉత్తర్వులు విడుదల చేయాలని లేదంటే ఈ నెల 28 నిరవధిక సమ్మె చేయనున్నట్లు జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు కాటవేణి కృష్ణ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్, అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) చాహత్ బాజ్‌పాయి ఎంపీపీ మల్లికార్జున్‌కు సమ్మె నోటీసు అందజేశారు. అంతకుముందు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రావణ్ కుమార్ గౌడ్, కోశాధికారి ప్రదీప్ గౌడ్, గౌరవ అధ్యక్షులు మల్లేష్, రాకేష్, ఉపాధ్యక్షులు మల్లీశ్వరి, మనీష్, వంశీ, ప్రేమ్ సాగర్, జాయింట్ సెక్రటరీలు వికాస్, తిరుపతి, శ్రీకాంత్, రవికుమార్, సభ్యులు శ్రీనివాస్, హరిదాస్, మారుతి శ్రీజ పాల్గొన్నారు.



సాగునీటి ప్రాజెక్టుల పనులు పూర్తి చేయాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కడే హేమంత్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

వర్షాకాలం ప్రారంభంలోగా జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పనులను పూర్తిచేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. శనివారం జిల్లా అదనపు కలెక్టర్ రాజేశంతో కలిసి జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు, చెరువులు, కాలువల పనులపై నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మిగిలిపోయిన పనులను వర్షాకాలం ప్రారంభమయ్యే లోగా పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని, వచ్చే ఖరీఫ్‌లో సాగునీరు అందించే విధంగా అధికారులు దృష్టి సారించాలని తెలిపారు. పరిపాలన అనుమతులు పొందిన పనులను ప్రారంభించాలని, చెరువులు, కాలువలు, ప్రాజెక్టులు మరమ్మత్తు పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పూర్తి చేయవలసిన పనుల వివరాలతో నివేదిక రూపొందించి అందించాలని తెలిపారు. అడ ప్రాజెక్టు ప్రధాన కాలువ తెగిపోయిన దగ్గర పనులను పూర్తి చేయాలని, ప్రాధాన్యతాపరంగా అవసరం ఉన్న పనులను ముందుగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, పనుల నిర్వహణలో అలసత్వం నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ గుణవంత్‌రావు, ప్రభాకర్, డిప్యూటీ ఈఈ దామోదర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

జిల్లాలో చేపట్టిన వంతెన నిర్మాణాలను, మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు సంబంధిత శాఖల అధికారులు కృషి చేయాలని ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్ అన్నారు. శనివారం పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ, రోడ్లు భవనాల శాఖ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో అభివృద్ధి పనుల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేసేందుకు అధికారులు చొరవ చూపాలని అన్నారు. జిల్లాలోని జైనూర్ మండలంలో కిషన్ నాయక్ తండా వద్ద చేపట్టిన వంతెన నిర్మాణం పనులను మీ మాసంతం వరకు పూర్తి చేయాలని, గుండి వాగు వంతెన పనులను పూర్తి చేయడంతో పాటు కరంజివాడ వంతెన సంబంధిత నివేదికను అందించాలని అధికారులను ఆదేశించారు. మన ఊరు మనబడి కార్యక్రమం మొదటి విడతలో భాగంగా జిల్లాలోని పాఠశాలలలో చేపట్టిన అభివద్ధి పనులపై పూర్తిస్థాయి నివేదిక రూపొందించి అందించాలని తెలిపారు. ఆయా పాఠశాలలలో మిగిలి ఉన్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేసి ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయితీ రాజ్ ఈఈ శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.

కుంబాల రాజేష్‌కు దళిత రత్న అవార్డు

నవతెలంగాణ-తాండూర్

దళిత వర్గాల అభ్యున్నతికి కృషి చేసినందుకుగాను బెల్లంపల్లి పట్టణానికి చెందిన కుంబాల రాజేష్‌కు తెలంగాణ రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్ చేతుల మీదుగా దళిత రత్న అవార్డుఅందుకున్నారు. శనివారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఏర్పాటుచేసిన సమావేశంలో అవార్డు ప్రధానం చేశారు. భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని అవార్డు అందజేసినట్టు ఆయన తెలిపారు. సేవను గుర్తించి అవార్డు ఇచ్చిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు బుర్ల వెంకటేశ్వరరావు మాల మహానాడు నాయకులకి ప్రత్యేక ధన్యవాదాలుతెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధమ్మ రాజశేఖర్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గాజుల నాగరాజు, నాయకులు నర్సింగ్ రావ్, శ్రీనివాస్ పాల్గొన్నట్లు తెలిపారు.

కొండుకూరి రాజుకు

జన్నారం : మండలంలోని చింతగూడ గ్రామానికి చెందిన కొండుకూరి రాజు మాదిగకు దళితరత్న అవార్డు లభించిందని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు లింగంపల్లి రాజలింగం తెలిపారు. శనివారం హైదరాబాదులోని రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో రాజుకు ఆ సంఘం రాష్ట్ర చైర్మన్ జె.కనకరాజు అవార్డును అందజేశారని ఆయన వివరించారు. దళిత రత్న అందుకున్న కొండుకూరు రాజును, జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్‌ఎం, ఎంపీపీ మాదాడి సరోజన, వైస్ ఎంపీపీ సూపర్ వినయ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీపతి పద్మ బుచ్చన్న, వైస్ చైర్మన్ గోట్ల రాజేష్ యాదవ్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ రియాజుద్దీన్, సర్పంచ్ల సంఘం జన్నారం అధ్యక్షుడు జాడి గంగాధర్, కో ఆప్షన్ సభ్యులు మున్వర్ అలీ ఖాన్, పీఏసీఎస్ చైర్మన్లు నాసాని రాజన్న, శీలం రమేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముత్తం సతీష్, అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు సిటీమల భరత్ కుమార్, ఇతర ప్రజా సంఘాల నాయకులు, ప్రముఖులు, సంఘం నాయకులు అభినందించారు.

ముస్లిముల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం : దివాకర్‌రావు



నవతెలంగాణ-లక్షెట్టిపేట్

ముస్లీం ల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే దివాకర్ రావు అన్నారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో రంజాన్ తోఫను ముస్లీంలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పండుగ పూట పేద ముస్లీంలు పాత బట్టలు ధరించవద్దనే మంచి సంకల్పంతో రంజాన్ తోఫాను ప్రభుత్వం అందిస్తుందన్నారు. షాదీముబారక్, కల్యాణలక్ష్మీ వంటి పథకాలు మహిళలకు ఎంతో మేలు చేస్తున్నాయని వివరించారు. అంతకుముందు మున్సిపల్ చైర్మన్ కాంతయ్య మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. సీఎం కేసీఆర్ ముస్లీంల అభివృద్ధికి కట్టుబడి పని చేస్తున్నారన్నారు. అనంతరం వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ త్వరలోనే ముస్లీం మైనారిటీలకు రూ.57 లక్షలతో ఫంక్షన్ హాల్ నిర్మించనున్నట్లు వివరించారు. అంతేకాకుండా ముస్లీంలకు 33 శాతం గృహలక్ష్మీ ఇండ్లలో కేటాయించాలని సభ ముఖంగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం సుమారు 270 మంది లబ్దిదారులకు రంజాన్ తోఫ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లీమ్ మైనారిటీ అధ్యక్షుడు సయ్యద్ సాహిద్ అలీ, డీసీఎమ్మెస్ చైర్మన్ తిప్పని లింగయ్య, తహసీల్దార్ జోత్స్న, మున్సిపల్ కమీషనర్ వెంకటేష్, కౌన్సిలర్లు సాయిని సుధాకర్, మెట్టు కళ్యాణి రాజు, సురేష్ నాయక్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పాదం శ్రీనివాస్, ఆర్ఐలు సంజీవ్, సమ్మక్క, మున్సిపల్ మేనేజర్ శ్రీహరి పాల్గొన్నారు.

దండేపల్లి : ప్రభుత్వం ప్రతి ఏడాది మాదిరిగానే రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని పేద ముస్లిములకు దుస్తులు, ఇతర సామగ్రిని కానుకగా అందిస్తున్నామని మంచిర్యాల ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్ రావు అన్నారు. శనివారం ప్రభుత్వం నుండి సరఫరా అయిన కానుకలను తహసీల్దార్ కార్యాలయంలో ముస్లింలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ అన్నివర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. పండుగలు సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశ్యంతో ఓ వైపు బతుకమ్మ చీరెలు, మరోవైపు క్రిస్మస్, రంజాన్ కానుకలు అందజేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ముస్లిం పేద కుటుంబాలకు రంజాన్ కానుకలను అందిస్తున్నామని తెలిపారు.

హాజీపూర్ : ఎంపీడీఓ కార్యాలయంలో ముస్లింలకు ఎమ్మెల్యే దివాకర్‌రావు శనివారం రంజాన్ కానుకలను పంపిణీ చేశారు. మండలంలోని17గ్రామ పంచాయతీల్లో 60మంది ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫాను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడా లేని విధంగా రంజాన్ పండుగను ఘనంగా నిర్వహిస్తున్నారని అన్నారు. రంజాన్‌తో పాటు క్రిస్మస్, బతుకమ్మ పండుగలకు ప్రభుత్వం తరపున కానుకలను అందజేస్తున్న కేసీఆర్ కలకాలం ముఖ్యమంత్రిగా ఉండాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మందపల్లి స్వర్ణలత శ్రీనివాస్, తహసీల్దార్ జాడి రాజలింగం, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మొగిలి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మాధవరపు జీవన్ రావు, మైనార్టీ మండల అధ్యక్షుడు అబ్దుల్లా, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు గోల్ల శ్రీనివాస్, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు నయీం పాషా, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఒడ్డె శ్రీనివాస్ పాల్గొన్నారు.

నస్పూర్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని మతాల సంక్షేమమే ధ్యేయంగా ముందుకెళుతుందని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు అన్నారు. నస్పూర్ సింగరేణి ఆఫీసర్స్ క్లబ్ భవనములో పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, పట్టణ కౌన్సిలర్లు, టీబీజీకేఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ సురేందర్ రెడి పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్ : బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని 14వ వార్డు ఏ జోన్ లోని స్థానిక బిలాల్ మసీదులో ముస్లిం మైనార్టీ కుటుంబాలకు రంజాన్ తోపా అందజేశారు. ఈ సందర్భంగా అజీజ్ మాట్లాడుతూ ప్రతి ముస్లిం కుటుంబం సంతోషంతో పండుగ జరుపుకోవాలని ఉద్దేశంతో కెసిఆర్ రాష్ట్ర ప్రభుత్వం ముస్లింలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, బీఆర్ఎస్ కోఆప్షన్ సభ్యుడు యాకుబ్ అలీ, కౌన్సిలర్లు జాడి శ్రీను, రెవిల్లి ఓదెలు నాయకులు గడ్డం రాజు, కుమార్, అభిలాష్, బిలాల్ మస్జిద్ కమిటీ సభ్యులు ఖాజా షరీఫ్, పాషా, ఇమ్రాన్, అన్వర్, తాజ్, షబ్బీర్ అలీ, చాంద్ పాషా పాల్గొన్నారు.

